తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 14- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 40 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# రాష్ట్ర ప్రయోజనాల కోసం సమిష్టి పోరాటం చేయాలి

- తెలంగాణ ప్రయోజనాల కోసం ఎంపీలకు సీఎం పిలుపు
- పార్లమెంట్ సమావేశాలపై ప్రజాభవన్‌లో సమీక్ష సమావేశం
- కీలక ప్రాజెక్టులు, నిధులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- మెట్రో రెండో దశ, ఆర్‌ఆర్‌ఆర్, మూసీ ప్రాజెక్టులకు వేగం అవసరం
- రాజకీయ భేదాలు పక్కనపెట్టి తెలంగాణ అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలి

“ తెలంగాణ రాష్ట్ర దీర్ఘకాల ప్రయోజనాల కోసం మనమంతా రాజకీయాలకు అతీతంగా ఒక్కటిగా పనిచేయాలి. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతును బలంగా వినిపించాలి. పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర నిధులు, హైదరాబాద్‌కు ఐఐఎం, మెట్రో విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్, మూసీ పునరుజ్జీవనం, జలవనరుల అంశాలపై కేంద్ర అనుమతులు సాధించేలా ప్రతి ఎంపీ సమిష్టిగా కృషి చేయాలని నేను కోరుతున్నాను.

2లో





## ఎల్‌నినోకు ముందస్తు కవచం

- మూడు దశల కార్యాచరణకు సిద్ధం
- రైతు నష్టపోకుండా అన్ని చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** వానాకాలం-2026లో ఎల్‌నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌లో భారత వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మూడు దశల ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. రైతులు ఎలాంటి నష్టం చవిచూడకుండా శాస్త్రీయ విధానాలతో ముందుకు సాగాలని అధికారులకు ఆదేశించారు.

మిగతా 2లో

## రూ.339 కోట్ల రహదారులకు శ్రీకారం

- హామ్ రోడ్ల పనులకు మంత్రుల శంకుస్థాపన
- సాగునీరు, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**జోగులాంబ గద్వాల, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** జోగులాంబ గద్వాల జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ధరూర్ మండల కేంద్రంలో రూ.339.39 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హామ్ రోడ్ల నిర్మాణ పనులకు రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ

మిగతా 2లో




## షాబాద్ హంతకుడు మృతి

- పెంజర్లలో శవమై కనిపించిన రాజ్‌కుమార్
- ఆత్మహత్యగా అనుమానం.. దర్యాప్తు కొనసాగింపు

2లో



## దేవాదుల పనులకు వేగం

- నిధుల కొరతకు తావులేదు
- రైతులకు సాగునీటిపై సర్కారు భరోసా
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ములుగు, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఆయనతో

మిగతా 7లో




## సింగరేణి అధికారులకు భరోసా

- సమస్యల పరిష్కారానికి భట్టి ఆదేశం
- రెండు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సూచన
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. బొగ్గు గనుల సంస్థల తరహాలో అధికారుల వేతన సవరణ, పనితీరు ఆధారిత ప్రోత్సాహక చెల్లింపుల అమలుపై అధికార సంఘం చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ఇటీవల తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరులో కీలక పాత్ర పోషించినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు సింగరేణి అధికార సంఘం నాయకులు ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి యాజమాన్యానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వారి వినతులపై సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క వెంటనే సింగరేణి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి చైర్మన్‌కమ్‌మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి,

మిగతా 7లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# రాష్ట్ర ప్రయోజనాల కోసం సమిష్టి పోరాటం చేయాలి

హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల ఎంపీలు సమిష్టిగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులు, అనుమతులు, నిధులు, అభివృద్ధి కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరణ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని పార్లమెంట్‌లో, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీలను కోరారు. ముఖ్యంగా రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యమైన నీటిపారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, రవాణా, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన ప్రతిపాదనలకు కేంద్ర అనుమతులు త్వరగా వచ్చేలా ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో భారతీయ నిర్వహణ సంస్థ (ఐఐఎం) ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని, దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి రాష్ట్రానికి ఐఐఎం మంజూరు చేయించాలని ఎంపీలను కోరారు. రాష్ట్ర అభివృద్ధికి జాతీయ స్థాయి విద్యాసంస్థలు అత్యంత అవసరమని పేర్కొన్నారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మొదటి దశ స్వాధీనం, ప్రాంతీయ వలయ రహదారి (ఆర్‌ఆర్‌ఆర్), మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులపై కూడా ముఖ్యమంత్రి విస్తృతంగా వివరించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూసేకరణ పూర్తయిందని, దక్షిణ భాగం భూసేకరణకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం అవసరమని తెలిపారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు తొలి దశ టెండర్ల దశకు చేరుకుందని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి అవసరమైన అనుమతులు త్వరగా వచ్చేలా ఎంపీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన జలవనరుల అంశాలపై కూడా సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది. తుంగభద్ర జలాల వినియోగం, గోదావరి-కావేరి నదుల అనుసంధానం, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు, ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి అవసరమైన నిరభ్యంతర పత్రాల సాధన వంటి అంశాలను ముఖ్యమంత్రి వివరించారు. గోదావరి జలాలను తెలంగాణకు అనుకూలంగా వినియోగించుకునేలా కేంద్ర ప్రభుత్వం, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసేందుకు ఎంపీలు కృషి చేయాలని సూచించారు. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో చర్చల్లో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. విమానయాన, రైల్వే రంగాల అభివృద్ధిపైనా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలకు అవసరమైన భూసేకరణ పూర్తయిందని, అక్కడ విమానాల మరమ్మతు కేంద్రాలు, సరుకు రవాణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయి నగరాలకు బుల్లెట్ రైలు ప్రాజెక్టుల ప్రతిపాదనలు కూడా పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతులు వచ్చేలా ఎంపీలు కృషి చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సహకార ధోరణితోనే ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎంపీలకు అవసరమైన సమాచారం, పత్రాలు ఎప్పటికప్పుడు అందించేందుకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పార్టీల ఎంపీలు రాజకీయ భేదాలను పక్కనపెట్టి తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కడియం కావ్య తదితరులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీలు కూడా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించి, కేంద్ర స్థాయిలో సమన్వయంతో ముందుకు సాగేందుకు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎస్సీ కమిషన్

- విద్యా సంస్కరణలపై సమగ్ర వివరణ
- యంగ్ ఇండియా వసతి పాఠశాలలపై వివరాలు
- ఎస్సీల అభివృద్ధికి కేంద్ర సహకారం కోరిన సీఎం


హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిశోర్ మక్వానా కమిషన్ సభ్యులతో కలిసి సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణలు, ఎస్సీల సంక్షేమం, సామాజిక న్యాయానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువర్గాలు చర్చించాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యార్థుల మధ్య కుల వివక్షకు తావులేకుండా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా సమీకృత వసతి పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విద్యాసంస్థలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం పాఠశాలల్లోనే అందించడంతో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మొదటి దశలో పట్టణ ప్రాంతాల్లో ఈ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీలకు వారి జనాభా నిష్పత్తికి మించి అవకాశాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజకీయాలు, పరిపాలన, ఇతర కీలక రంగాల్లో ఎస్సీలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేసి అమలు చేస్తున్నామని, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వివరించారు.

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్‌ను ముఖ్యమంత్రి కోరారు. ఎస్సీల విద్య, ఉపాధి, సంక్షేమం, సామాజికాభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం మరింత సహకారం అందిస్తే రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయగలమని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలపై విస్తృతంగా చర్చించారు.






## రూ.339 కోట్ల రహదారులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి దేశంలోనే అత్యధికంగా నిధులు కేటాయించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ అవకాశాలు, ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇచ్చే విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళా సంఘాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ.25 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని తెలిపారు. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచడం ద్వారా కరువు పరిస్థితుల్లోనూ తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే ఆయకట్టు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందని వెల్లడించారు.

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రహదారులకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందన్నారు. గతంలో కూడా పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. జిల్లాలో సాంకేతిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, వివిధ సంస్థల చైర్మన్లు, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో రహదారుల నిర్మాణంతో పాటు సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు తెలిపారు.



## ఎల్‌నినోకు ముందస్తు కవచం

(మొదటి పేజీ తరువాయి)




శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి వ్యవసాయ యాజమాన్య పద్ధతిని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, వాటిని తప్పనిసరిగా అమలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించాలని, వర్షాభావ పరిస్థితులు తలెత్తిన వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణను అమలు చేయాలని సూచించారు. రైతులకు సమయానుకూలంగా శాస్త్రీయ సలహాలు అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. వర్షాలు ఆలస్యమైనా రైతులకు విత్తనాల కొరత లేకుండా ముందుగానే అవసరమైన నిల్వలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి వారం మండలాల వారీగా వర్షపాతం, భూగర్భ జలాలు, నీటి లభ్యత, నేల తేమ, పంటల పరిస్థితి, వాతావరణ అంచనాలు, సాగునీటి అందుబాటు వంటి వివరాలతో సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమాచారాన్ని రైతు వేదికలు, గ్రామ పంచాయతీలు, వ్యవసాయ అధికారులు, సామాజిక మాధ్యమాలు, స్థానిక మాధ్యమాల ద్వారా ప్రతి రైతుకు చేరవేయాలని సూచించారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగుపై శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని మంత్రి కోరారు. వర్షాలు ఆలస్యమైతే తక్కువ కాలంలో పండే పంటలను ఎంచుకోవడం, నేల తేమను సంరక్షించడం, నీటి పొదుపు పద్ధతులను అమలు చేయడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఎల్‌నినోపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అవసరమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ఇప్పటికే సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతు నష్టపోకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, శాస్త్రీయ సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

## షాబాద్ హంతకుడు మృతి



రంగారెడ్డి, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో భార్య, ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురిని అత్యంత దారుణంగా హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు బి. రాజ్‌కుమార్ (29) సోమవారం మృతిగా కనిపించాడు. హైదరాబాద్ శివారులోని కొత్తూరు మండలం పెంజర్ల సమీపంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, ఇతర ఉన్నతాధికారులు మృతదేహాన్ని పరిశీలించి అది రాజ్‌కుమార్‌దేనని నిర్ధారించారు. మృతదేహం సమీపంలో విషం సీసా లభించడంతో అతను విషం తాగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల ఖచ్చితమైన కారణం వెల్లడవుతుందని తెలిపారు.

ఈ నెల 10వ తేదీ రాత్రి షాబాద్ మండలంలో రాజ్‌కుమార్ అత్యంత దారుణంగా ఆరుగురిని హత్య చేసిన విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తనపై పోక్సో కేసు నమోదు చేసిన 17 ఏళ్ల బాలిక, ఆమె తల్లి, నాయనమ్మతో పాటు తన భార్య సరిత, ఇద్దరు కుమారులను కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటన అనంతరం పరారైన అతని కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్యలకు పాల్పడిన అనంతరం రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పడంతో పాటు తాను కూడా చనిపోతున్నట్లు తెలిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోక్సో కేసు నమోదైనందుకు కక్ష పెంచుకునే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇటీవలే అతనికి ముందస్తు బెయిల్ లభించినట్లు అధికారులు తెలిపారు.

నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతి ప్రకటిస్తూ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా గాలింపు చేపట్టారు. ఇదే సమయంలో బాధితుల కుటుంబ సభ్యులు తమకు నిందితుడి నుంచి ప్రాణహాని ఉందని ముందుగానే ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు తగిన రక్షణ కల్పించలేదని ఆరోపించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చ జరిగింది. బాధితుల ఫిర్యాదుల నేపథ్యంలో పోక్సో కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న షాబాద్ ఎస్సై టి. రమేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రాజ్‌కుమార్ మృతిపై, అలాగే షాబాద్ హత్యల కేసులోని అన్ని కోణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# వర్షాల కోసం శివుడికి జలాభిషేకం



- రైతాంగ శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజలు

**హుజురాబాద్, జూలై 13(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మండలంలోని బోర్నాపల్లి గ్రామ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక జలాభిషేకం, రుద్రాభిషేకం, శివార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థించారు.

ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర జలాలు, పాలు, పంచామృతాలతో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక రుద్రాభిషేకం, అర్చనలు, మహామంగళహారతి నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా *"ఓం నమఃశివాయ"* నామస్మరణతో మారుమోగింది. భక్తులు బిల్వదళాలు సమర్పించి శివయ్య కటాక్షం కోసం ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో 14వ, 24వ వార్డు కౌన్సిలర్లు పాల్గొని గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, వాగులు నిండాలని, రైతులు పండించిన పంటలకు మంచి దిగుబడులు రావాలని, ప్రతి రైతు కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వ్యవసాయం అభివృద్ధి చెందితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర్ శర్మ మాట్లాడుతూ బోర్నాపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం మహిమాన్వితమైన క్షేత్రమని తెలిపారు. శివయ్యను భక్తిశ్రద్ధలతో ఆరాధించిన వారికి ఆయన అనుగ్రహం ఎల్లప్పుడూ లభిస్తుందని చెప్పారు. ఈ ఆలయంలో గతంలో నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం అనేక సందర్భాల్లో మంచి వర్షాలు కురిసినట్లు గ్రామ పెద్దలు చెప్పుకుంటూ వస్తున్నారని, ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆధ్యాత్మిక విశిష్టత ఉందని వివరించారు. భక్తి, విశ్వాసంతో చేసే ప్రార్థనలకు పరమేశ్వరుడు తప్పకుండా స్పందిస్తాడనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉందన్నారు.

గ్రామ పెద్దలు మాట్లాడుతూ రైతు సంక్షేమమే అందరి సంక్షేమమని, ప్రకృతి అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కోరుతూ ఈ జలాభిషేకాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోగా, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల జీవితాల్లో సంతోషాలు నింపాలని, రాష్ట్రం పచ్చదనంతో కళకళలాడాలని అందరూ ఏక మనసుతో శ్రీ రాజరాజేశ్వర స్వామిని ప్రార్థించారు.ఈ కార్యక్రమం లో అర్చకులు భాస్కర్ శర్మ,14,24వార్డ్ కౌన్సిలర్లు రాజు,శ్రీనివాస్,సంపత్ రావు,రాజన్న,అశోక్,దినేష్,దేవరాజు,ఊరి ప్రజలుభారీ సంఖ్యలో పాల్గొని దేవుని మీద భక్తితో రైతుల మీద వారికున్న సానుభూతి ప్రేమను చాటుకున్నారు.

# శివకృప కోసం భక్తుల రద్దీ ఘనంగా రుద్రాభిషేకాలు





**ఎల్కతుర్తి , జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్లభాపురం గ్రామంలో ఉన్న శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శివకృప కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఉదయం వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి పంచామృత సహిత మహా రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, విశేష అర్చనలు, మహామంగళహారతి ఘనంగా నిర్వహించారు. అనంతరం నైవేద్య సమర్పణ చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం అంతా శివనామస్మరణతో మారుమోగగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర రోజున రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంజి భావన ఋషి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.





# చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమం

- ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు

**హుజురాబాద్, జూలై 13(తెలంగాణ ముచ్చట్లు ):** చిన్నారులను నలిపురుగుల బారిన పడకుండా కాపాడి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో సోమవారం జాతీయ నలిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు హాజరై 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఒక చిన్న మాత్ర... పిల్లల ఆరోగ్యానికి గొప్ప రక్షణ. నలిపురుగుల నివారణ మాత్ర ప్రతి చిన్నారి హక్కు - ప్రతి తల్లిదండ్రుల బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేయించడం ద్వారా నలిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ మాత్రలను ఉచితంగా అందజేస్తోందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డీటీసీవో హిమబిందు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల, సీడీపీవో సుగుణ, మున్సిపల్ కౌన్సిలర్లు సునీత, శ్రీలేఖ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా..? అధికారుల వైఫల్యమా..? NH 765DGపై ప్రశ్నల వర్షం





- వెంటనే పనులు పూర్తి చేయాలి.. లేదంటే ప్రజలతో కలిసి ఆందోళన
- బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్

**ఎల్కతుర్తి, జూలై 13( తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం నుంచి దామెర గ్రామానికి వెళ్లే NH 765DG జాతీయ రహదారిపై చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి పక్కన లోతైన గుంతలు తవ్వి పనులను మధ్యలోనే నిలిపివేయడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హెచ్చరిక బోర్డులు, రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారని తెలిపారు. డ్రైనేజీలో మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల సమస్య తీవ్రంగా పెరిగి ప్రజారోగ్యానికి కూడా ముప్పుగా మారిందన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ దుస్థితికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా..? అధికారుల పర్యవేక్షణ వైఫల్యమా..? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని శ్రీకాంత్ యాదవ్ అన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, భద్రతా చర్యలు పాటించకపోవడం బాధాకరమని విమర్శించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తి చేయడంతో పాటు రహదారిని మరమ్మతు చేసి ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ హెచ్చరించారు

# హుజురాబాద్‌లో ఎస్ ఐ ఆర్ సర్వేపై అవగాహన



- బోర్నపల్లి వార్డులో ఇంటింటికీ ప్రచారం నిర్వహించిన బీజేపీ నాయకులు

**హుజురాబాద్, జూలై 13(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి వార్డులో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) ఓటరు జాబితా సర్వేపై బీజేపీ నాయకులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి సర్వే ప్రాముఖ్యతను వివరించారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ ఐ ఆర్ సర్వేలో ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా పాల్గొని, అధికారులు కోరిన వివరాలు, అవసరమైన పత్రాలను అందించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు సక్రమంగా నమోదై ఉండేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొని సర్వే విజయవంతానికి తమ వంతు సహకారం అందించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఎస్ఐఆర్ ప్రక్రియను గ్రామంలో వేగవంతంగా పూర్తి చేయాలి

- సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం



**పెద్దమందడి,జూలై13(తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను గ్రామంలో వేగవంతంగా పూర్తి చేయాలని పెద్దమందడి మండలం పామిడిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి మధిర మంజుల శ్రీశైలం బూత్ లెవల్ అధికారులకు సూచించారు.సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గ్రామానికి సంబంధించిన ఓటరు దరఖాస్తులను బూత్‌వారీగా పరిశీలించిన ఆమె, గ్రామంలో మొత్తం నాలుగు పోలింగ్ బూత్‌లు (78, 79, 80, 82) పరిధిలో 2,035 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 1,602 మంది ఓటర్ల వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు 78 శాతం నమోదు పూర్తైందని, మిగిలిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసి వారం రోజుల్లోనే గ్రామాన్ని 100 శాతం నమోదు లక్ష్యానికి చేర్చాలని ఆదేశించారు. బూత్‌వారీగా పురోగతిని పరిశీలించగా, బూత్ నంబర్-78లో 840 మంది ఓటర్లకు గాను 637 మంది, బూత్ నంబర్-79లో 693 మందికి గాను 534 మంది, బూత్ నంబర్-80లో 324 మందికి గాను 296 మంది, బూత్ నంబర్-82లో 178 మందికి గాను 135 మంది ఓటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వెల్లడైంది.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దరఖాస్తును సకాలంలో పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని బీఎల్‌వోలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్రవంతి, బీఎల్‌వోలు లక్ష్మి, బీఎల్ఏ కొంకలి నరసింహాతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.






## ఏకలవ్య పాఠశాలలో నులిపురుగు నివారణ కార్యక్రమం

- కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి.
- విద్యార్థులకు నివారణ మాత్రల పంపిణీ.

**అశ్వారావుపేట, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములకలపల్లి మండలం మూకమామిడి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ప్రారంభించి విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, బలహీనత, పోషకాహార లోపం ఏర్పడి చదువుపై ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా ఉండవచ్చని, పిల్లల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల సిక్‌రూమ్‌లో జ్వరంతో ఉన్న విద్యార్థులను పరామర్శించి, బలహీనంగా ఉన్న విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని తరగతుల విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పూజ ప్రసన్న, ఏఎన్ఎం అనిత, ఆశా కార్యకర్తలు బచ్చల పద్మ, కణితి జయ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జమ్మికుంట సమీపంలో రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



**జమ్మికుంట టౌన్ జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ పరిధిలో సోమవారం ఉదయం బిసుగిరిషరీఫ్-జమ్మికుంట రైల్వే స్టేషన్ల మధ్య దిగువ లైన్లో వెళ్లిన ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపారు.

మృతుడి వయస్సు సుమారు 60-65 సంవత్సరాలు. ఆయన లేత పింక్ రంగు టీ షర్ట్, నలుపు రంగు నెక్కర్ (తెలుపు గీతల డిజైన్‌తో) ధరించి ఉన్నారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ఇతర వివరాలు తెలిపే వస్తువులు లభించలేదు.

మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి. తిరుపతి, రామగుండం విచారణ చేపట్టారు.

మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా ఆయనను గుర్తించగలిగిన వారు 9949304574 లేదా 8712658604 నంబర్లకు సమాచారం అందించాలని ప్రభుత్వ రైల్వే పోలీసులు విజ్ఞప్తి చేశారు.







## నీటి సంరక్షణే భావితరాల రక్షణ.. జమ్మికుంటలో జల ప్రతిజ్ఞ

**జమ్మికుంట టౌన్ జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో "జల్ శక్తి అభియాన్ - వర్షాన్ని పట్టుకోండి" కార్యక్రమంలో భాగంగా సోమవారం నీటి సంరక్షణపై జల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నీటి సంరక్షణకు అంకితమవుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, నీటిని పొదుపుగా, తెలివిగా వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రతి నీటి చుక్కను అమూల్యమైన వనరుగా భావించి దాన్ని వృథా కాకుండా కాపాడాలని, వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో నీటిని మితంగా వినియోగించడం ద్వారానే భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. "ఈ గ్రహం మనది.. దాన్ని కాపాడే బాధ్యత కూడా మనదే. జల ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చుకుందాం" అని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, టీపీఓ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూర్‌లో ఓటర్ నమోదు సవరణలపై అవగాహన



**పెద్దమందడి,జూలై13(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓ ఇన్‌చార్జి కరుణ, బీఎల్ఏ 2 ఇన్‌చార్జి మద్దూర్ నరసింహ గ్రామంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, చిరునామా మార్పు, పేర్ల తొలగింపు తదితర సేవలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేస్తూ అవగాహన కల్పించారు. ఫారాలను సక్రమంగా నింపే విధానం, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు సమర్పణ ప్రక్రియ గురించి వివరించారు.ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ వివరాలను ఒకసారి పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే సవరణ చేయించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆరోగ్యవంతమైన బాల్యానికి నులిపురుగుల నివారణ కీలకం



**పెద్దమందడి,జూలై13(తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిన్నారులకు నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, ఏఎన్ఎం తారాదేవి, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతంగా ఎదగాలంటే నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## శిథిలావస్థలో ఎస్సీ బాలుర హాస్టల్.. కొత్త భవనం నిర్మించాలని కలెక్టర్‌కు వినతి



**వనపర్తి,జూలై13(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నాయకులు తెలిపారు. హాస్టల్‌కు వెంటనే నూతన భవనం నిర్మించి, అన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం సమర్పించారు. సుమారు 55 ఏళ్ల క్రితం నిర్మించిన హాస్టల్ భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉందని, గత ఎనిమిదేళ్లుగా కొత్త భవనం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. హాస్టల్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేవని తెలిపారు. వర్షాకాలంలో గదుల్లోకి నీరు కారడం, పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడటం వల్ల విద్యార్థుల ప్రాణ భద్రతకు ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు హాస్టల్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తక్షణమే కొత్త భవనం మంజూరు చేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి పరుశురాముడు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ గంధం నాగరాజు, తాడిపత్రి మాజీ సర్పంచ్ జోగు శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వరమ్మపై వ్యాఖ్యలు ఖండనీయం.. కేశబోయిన అశోక్ యాదవ్ ఆగ్రహం

- జక్కిడి శివచరణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



**హుజురాబాద్, జూలై 12(తెలంగాణ ముచ్చట్లు ):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలు, యాదవుల పెద్దమ్మగా పేరొందిన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలను యాదవ విద్యావంతుల వేదిక జిల్లా నాయకుడు కేశబోయిన అశోక్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.
ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ, యాదవ సమాజానికి గౌరవనీయురాలైన ఈశ్వరమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. యాదవుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే సమాజం సహించబోదని హెచ్చరించారు.
జక్కిడి శివచరణ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా యాదవ సంఘాలతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. యాదవ సమాజాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘాల నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా నాయకులు, వివిధ మండలాల యాదవ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈశ్వరమ్మకు మద్దతు ప్రకటిస్తూ, వివాదాస్పద వ్యాఖ్యలను ఖండించారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్



**పెద్దమందడి,జులై13(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం తీరును తెలుసుకునేందుకు పెద్దమందడి మండలం మనిగిళ్ల ప్రభుత్వ పాఠశాలను గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.అనంతరం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ స్వయంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు, గ్రామ యువకులతో కలిసి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సర్పంచ్ తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ యువకులు బోడి గణేష్, బోయిన్ గణేష్, భాస్కర్ గౌడ్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు విద్యార్థులకు ఆల్బెండజోల్ పంపిణీ



**పెద్దమందడి,జులై13(తెలంగాణ ముచ్చట్లు-):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (ఎన్‌డీడీ) సందర్భంగా సోమవారం పెద్దమందడి మండలం వెల్టూర్ జడ్పీ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు సమక్షంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఎన్ఎం తారాదేవి విద్యార్థులకు నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆశా కార్యకర్తల సహకారంతో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలల నుంచే ఆరోగ్య పరిరక్షణ.. జమ్మికుంటలో ఆల్బెండజోల్ పంపిణీ



**జమ్మికుంట టౌన్ జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట మున్సిపల్, మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు మరియు అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో భాగంగా 44 ప్రభుత్వ పాఠశాలలు, 56 అంగన్వాడీ కేంద్రాలు, 17 ప్రైవేట్ పాఠశాలలు, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాల, ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెండు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు.
జమ్మికుంట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగకరమని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన బాల్యం కోసం ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
మాత్రలు తీసుకోలేకపోయిన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన నిర్వహించే మాప్‌అప్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ, మండల విద్యాధికారి ప్రేమలత, కౌన్సిలర్ మాచర్ల రాజు, డాక్టర్ చందన, డాక్టర్ మహోన్నత్ పటేల్, డాక్టర్ బిందు, డాక్టర్ కార్తీక్, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సంధ్య, ప్రధానోపాధ్యాయుడు బాదం సురేష్, సూపర్వైజర్ సదానందం, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# 15 రోజుల్లో అర్హులందరికీ అక్రిడిటేషన్‌లు

- టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర స్పందన
- ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, రాష్ట్రస్థాయి బస్ పాస్ లు, ఇతర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...
- జర్నలిస్టుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ భారీ ఆందోళన
- 15న హైదరాబాద్ సమాచార భవన్ ఎదుట ఆందోళనకు తరలి రావాలి
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం బ్యూరో, జూలై 13(తెలంగాణ ముచ్చట్లు ):** పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ లు 15 రోజుల్లో ఇస్తామని టీడబ్ల్యూజేఎఫ్ నేతలకు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా సమాచారశాఖ అధికారికి ఆదేశాలు జారీచేశారు. ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర జర్నలిస్టు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ 2843) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ముందు సోమవారం వందమందికి పైగా జర్నలిస్టులు గంటసేపు భారీ ఆందోళన నిర్వహించారు.
జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదు : టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి
జర్నలిస్టుల సమస్యలన్నీ పరిష్కరించే వరకూ పోరాటం నిర్వహిస్తామని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి లు తెలిపారు. 15న హైదరాబాద్ లోని సమాచార శాఖ కమిషనరేట్ వద్ద నిర్వహించే ఆందోళనకు ఖమ్మం జిల్లా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ ప్రభుత్వం ఏర్పాటులోనూ, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులోనూ జర్నలిస్టులు క్రియాశీలకంగా పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పనితీరుకు తగ్గట్టుగా రాత్రనకా, పగలనకా నిరంతరాయంగా పనిచేస్తున్న జర్నలిస్టులు నేడు చాలీచాలని వేతనాలతో.. ఆర్థిక ఇబ్బందుల నడుమ కిరాయి ఇండ్లలో జీవనం కొనసాగిస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నాయే తప్ప.. ఆచరణలో పెట్టడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకూ హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులకు సరిపడా అక్రిడిటేషన్ల ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వివిధ సర్టిఫికెట్ల పేరుతో రకరకాల కొర్రీలు పెట్టుతుండడం వల్ల పనిచేస్తున్న అనేకమంది జర్నలిస్టులు అక్రిడిటేషన్ లు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గం, మున్సిపల్ సెంటర్లలో పని చేస్తున్న రిపోర్టర్లందరికీ అక్రిడిటేషన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వాసాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టీబీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుకొండ రవికిరణ్, సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, స్టేట్, జిల్లా కమిటీ సభ్యులు చీనేని బాలకృష్ణ, సంతోష్ చక్రవర్తి, నలుబోల మధుశ్రీ, షేక్ జానీపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, గణేష్, గంగాధర్, నాగిరెడ్డి, అంజయ్య, బంకా వెంకటేశ్వర్లు, నాయకులు యాస లక్ష్మారెడ్డి, బండి కుమార్, పత్తి శ్రీనివాస్, అంజద్, శరత్, అర్షద్, గోపీ కృష్ణ, అశోక్ రెడ్డి, వీసారపు అంజయ్య, ఉపేందర్, కె.కిరణ్, గోపీ, షకీల్, సునీత, నాగలక్ష్మి, చంద్రశేఖర్, ధనాలకోట రవికుమార్, జావీద్, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం బ్యూరో, జూలై- 13(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.
కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.
కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యా శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి.ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 27న తెలంగాణ జర్నలిస్టుల "ఛలో పార్లమెంట్"

- జంతర్ మంతర్ లో ఒకరోజు ధర్నా

**ఖమ్మం బ్యూరో,జూలై 11(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మంకేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, ఈ నెల 27వ తేదీన "తెలంగాణ జర్నలిస్టుల ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల డిమాండ్ల సాధనకై ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు వారు శనివారం నాడిక్కడ మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, జర్నలిస్టుల రక్షణ చట్టం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు తదితర డిమాండ్ల పై 27న ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద (జంతర్ మంతర్ లో) ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన స్కీం ను కేంద్ర ప్రభుత్వం గత కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించలేదని, దీంతో జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసుల సదుపాయాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్"ను ఏర్పాటు చేయాలని కోరారు.




రిటైర్డ్ జర్నలిస్టులకు కొన్ని రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేదని, దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులను నిలువరించేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాలని అన్నారు.ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# విధి నిర్వహణలో ప్రతిభకు గుర్తింపు.. ప్రశంసా పత్రం అందుకున్న చిట్టెల మౌనిక

**ఇల్లంతకుంట టౌన్ జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** విధి నిర్వహణలో కృషి, అంకిత భావం, నిబద్ధతతో సేవలందించిన పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే లక్ష్యంతో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ నిర్వహించిన రివార్డ్ మేళాలో ఇల్లంతకుంట మండలంలో విధులు నిర్వహిస్తున్న చిట్టెల మౌనిక ప్రశంసా పత్రం (సర్టిఫికేట్ ఆఫ్ అప్రిషియేషన్) అందుకుని ప్రతిభ చాటుకున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న మౌనిక, ఈ గుర్తింపును తన విధి నిర్వహణకు లభించిన గౌరవంగా అభివర్ణించారు. సేవా దృక్పథంతో పనిచేసే ప్రతి ఉద్యోగికి ఇలాంటి గుర్తింపులు మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా భవిష్యత్తులో మరింత బాధ్యతతో పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు అదే అంకితభావంతో కృషి కొనసాగిస్తానని స్పష్టం చేశారు.తన సేవలను గుర్తించి ప్రశంసా పత్రం అందజేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఉన్నతాధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు అందించిన ప్రోత్సాహం తన విజయానికి బలమైందని పేర్కొన్నారు.చిట్టెల మౌనికకు లభించిన ఈ ప్రశంసా పత్రంపై సహచర పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ గుర్తింపు ఆమె సేవా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు




# లావా 'విరాట్ వి1' సిరీస్ ఆవిష్కరణ.. 5జీ, 4జీ మోడళ్లు విడుదల

**న్యూఢిల్లీ, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ లావా తన కొత్త 'విరాట్ వి1' సిరీస్‌ను జులై 21న మార్కెట్లోకి తీసుకురానుంది. ఈ సిరీస్‌లో 'విరాట్ వి1 5జీ', 'విరాట్ వి1 4జీ' మోడళ్లను మధ్యాహ్నం 12 గంటలకు అధికారికంగా ఆవిష్కరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ రెండు స్మార్ట్‌ఫోన్లు ప్రముఖ ఈవాణిజ్య వేదిక ఫ్లిప్‌కార్ట్‌లో ప్రత్యేకంగా విక్రయానికి అందుబాటులోకి రానున్నాయి. లావా ఇప్పటికే ఈ ఫోన్ల కోసం ప్రత్యేక ప్రచార పేజీని ప్రారంభించింది. రూపకల్పన పరంగా రెండు మోడళ్లు దాదాపు ఒకే తరహాలో ఉన్నప్పటికీ, కెమెరా అమరికలో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. 'విరాట్ వి1 4జీ'లో 13 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో కూడిన చదరపు ఆకారపు కెమెరా మాడ్యూల్ ఉండగా, 'విరాట్ వి1 5జీ'లో ద్వంద్వ వెనుక కెమెరా వ్యవస్థను అందించారు.
ఈ స్మార్ట్‌ఫోన్లు నీలం, బంగారు రంగుల్లో లభించనున్నాయి. ముఖ్యంగా 5జీ మోడల్ వెనుక భాగంలో ప్రత్యేక ఆకర్షణీయ నమూనాను రూపొందించారు. అలాగే యూఎస్‌బీ టైప్‌సి పోర్ట్, 3.5 మిల్లీమీటర్ల హెడ్‌ఫోన్ జాక్, స్పీకర్ గ్రిల్ వంటి సౌకర్యాలను కూడా అందించారు.భారతీయ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని 'మేడ్ ఇన్ ఇండియా' విధానంలో ఈ స్మార్ట్‌ఫోన్లను తయారు చేస్తున్నట్లు లావా తెలిపింది. ధరల విషయానికి వస్తే, 'విరాట్ వి1 5జీ' ధర సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల మధ్య ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 'విరాట్ వి1 4జీ' మోడల్ మరింత తక్కువ ధరలో అందుబాటులోకి రానుంది. ప్రాసెసర్, బ్యాటరీ, డిస్‌ప్లే తదితర పూర్తి సాంకేతిక వివరాలను జులై 21న జరిగే ఆవిష్కరణ కార్యక్రమంలో కంపెనీ వెల్లడించనుంది.

# వృద్ధుడి ఖాతాలో రూ.759 కోట్లు.. బ్యాంకు అధికారుల విస్తుపాటు

**ముజఫర్‌పూర్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వెళ్లిన ఓ వృద్ధుడి బ్యాంకు ఖాతాలో ఏకంగా రూ.759 కోట్లు కనిపించడం కలకలం రేపింది. ఇదే సమయంలో ఆయన కుమారుడి ఖాతాలో కూడా అంతే మొత్తం కనిపించడంతో బ్యాంకు అధికారులు, స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటన బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది.82 ఏళ్ల కామేశ్వర్ మిశ్రా తన వృద్ధాప్య పింఛన్ నగదు తీసుకునేందుకు సమీపంలోని సామాన్య సేవా కేంద్రానికి వెళ్లారు. ఆ రోజు బ్యాంకులకు సెలవు ఉండటంతో అక్కడే ఆధార్ ధ్రువీకరణ ద్వారా పింఛన్ మొత్తాన్ని ఉపసంహరించుకున్నారు. అనంతరం తన ఖాతాలో ఇంకా ఎంత మొత్తం ఉందో తెలుసుకోవాలని కేంద్రంలోని సిబ్బందిని కోరారు. సిబ్బంది ఖాతా వివరాలు పరిశీలించగా కామేశ్వర్ మిశ్రా ఖాతాలో ఏకంగా రూ.759 కోట్లు ఉన్నట్లు కనిపించింది. దీంతో వారు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం ఆయన దివ్యాంగుడైన కుమారుడి బ్యాంకు ఖాతాను కూడా పరిశీలించగా అందులోనూ రూ.759 కోట్లు జమ అయినట్లు గుర్తించారు. దీంతో ఇద్దరి ఖాతాల్లో కలిపి మొత్తం రూ.1,518 కోట్లు ఉన్నట్లు తేలింది. ఈ విషయాన్ని సామాన్య సేవా కేంద్రం సిబ్బంది వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులకు, పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించి, భద్రతా చర్యల్లో భాగంగా కామేశ్వర్ మిశ్రా, ఆయన కుమారుడి బ్యాంకు ఖాతాలను తాత్కాలికంగా స్తంభింపజేశారు.

# హుజురాబాద్ ఆర్ఎంపీ–పీఎంపీకి కొత్త నాయకత్వం

## రవీందర్, శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం




**హుజురాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్ఎంపీ-పీఎంపీ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హుజురాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా కొక్కుల రవీందర్ ప్రమాణ స్వీకారం చేయగా, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సభ్యుడిగా కందకట్ల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కొక్కుల రవీందర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆర్ఎంపీ-పీఎంపీ వైద్యుల పాత్ర కీలకమని అన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సభ్యుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.జిల్లా ఈసీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన కందకట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, సభ్యుల సమస్యలను జిల్లా, రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామీణ వైద్యుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ పథకాల సాధన కోసం సంఘం తరపున నిరంతరం పనిచేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు నూతనంగా ఎన్నికైన నాయకులను శాలువాలతో సత్కరించి అభినందించారు. వారి నాయకత్వంలో హుజురాబాద్ డివిజన్‌లో సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి ఆర్ఎంపీ-పీఎంపీ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

# స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు

**ముంబై, జులై 13 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం తీవ్ర ఒడిదొడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. రోజంతా నష్టాల్లో ట్రేడైన సూచీలు చివరి గంటలో సమాచార సాంకేతిక రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో కోలుకుని ఫ్లాట్‌గా ముగిశాయి. వినియోగ వస్తువులు, లోహ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ, సమాచార సాంకేతిక రంగం మార్కెట్లకు అండగా నిలిచింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ 47.01 పాయింట్లు పెరిగి 77,616.40 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 4.10 పాయింట్ల స్వల్ప లాభంతో 24,211 వద్ద స్థిరపడింది. మధ్యాహ్నం వరకు నష్టాల్లో కనిపించిన సూచీలు చివరి సెషన్‌లో కొనుగోళ్లతో పుంజుకోవడం విశేషం. ఈరోజు ట్రేడింగ్‌లో సమాచార సాంకేతిక రంగ షేర్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ సంస్థల షేర్లు లాభపడటంతో సమాచార సాంకేతిక రంగ సూచీ మెరుగైన ప్రదర్శన కనబరిచింది. మరోవైపు వినియోగ వస్తువులు, లోహ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. విస్తృత మార్కెట్‌లో మధ్యతరహా, చిన్నతరహా కంపెనీల సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి.
ఇదిలా ఉండగా, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు నాలుగు శాతానికి పైగా పెరగడం దేశీయ కరెన్సీపై ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 0.26 శాతం బలహీనపడి 95.60 వద్ద ట్రేడైంది. ముడి చమురు దిగుమతుల వ్యయం పెరిగే అవకాశాల నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సమీప రోజుల్లో రూపాయి విలువ 95.20 నుంచి 96.00 మధ్య కదిలే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.







# రెనో ట్రైబర్‌పై భారీ తగ్గింపు.. రూ.60 వేల వరకు ఆఫర్లు

**చెన్నై, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ వాహన తయారీ సంస్థ రెనో ఇండియా తన ప్రముఖ ఏడు సీట్ల బహుళ ప్రయోజన వాహనం ట్రైబర్‌పై ఆకర్షణీయమైన రాయితీలను ప్రకటించింది. పరిమిత కాలం పాటు అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక ఆఫర్లలో భాగంగా గరిష్ఠంగా రూ.60 వేల వరకు ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించింది. అయితే ఈ రాయితీలు రాష్ట్రం, వాహన రూపాంతరం, తయారీ సంవత్సరం, కొనుగోలుదారుడి అర్హతను బట్టి మారుతాయని సంస్థ వెల్లడించింది.
సంస్థ తెలిపిన వివరాల ప్రకారం కేరళలో ట్రైబర్‌పై గరిష్ఠంగా రూ.60 వేల వరకు రాయితీ లభించనుండగా, గుజరాత్‌లో రూ.45 వేల వరకు తగ్గింపు అందిస్తోంది. మిగిలిన చాలా రాష్ట్రాల్లో గరిష్ఠంగా రూ.30 వేల వరకు ప్రయోజనాలు లభించనున్నాయి. ఈ ఆఫర్లలో నగదు తగ్గింపుతో పాటు పాత వాహనం మార్పిడి ప్రోత్సాహకం, స్క్రాప్ ప్రోత్సాహకం, విధేయత రాయితీ, పరిచయ రాయితీ, కార్పొరేట్ రాయితీ వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి.
రెనో ట్రైబర్ ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధర రూ.5.81 లక్షలు కాగా, గరిష్ఠ ధర రూ.8.48 లక్షల వరకు ఉంది. ఏడు సీట్ల సౌకర్యంతో అందుబాటు ధరలో లభిస్తున్న బహుళ ప్రయోజన వాహనాల్లో ఇది ఒకటిగా నిలిచింది. ఇందులో ఒక లీటర్ సామర్థ్యం గల మూడు సిలిండర్ల పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఐదు వేగాల మాన్యువల్ లేదా స్వయంచాలక మాన్యువల్ గేర్‌బాక్స్ ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. మాన్యువల్ రూపాంతరం లీటరు పెట్రోల్‌కు సుమారు 20 కిలోమీటర్ల వరకు, స్వయంచాలక మాన్యువల్ రూపాంతరం లీటరుకు సుమారు 17 కిలోమీటర్ల వరకు ఇంధన సామర్థ్యాన్ని అందిస్తుందని సంస్థ తెలిపింది.
వాహనం రూపాంతరాన్ని బట్టి ఎనిమిది అంగుళాల స్పర్శ తెర వినోద వ్యవస్థ, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, డిజిటల్ పరికరాల సముదాయం, వెనుక సీట్లకు ప్రత్యేక శీతలీకరణ గాలి వెంట్లు, బటన్ ద్వారా ఇంజిన్ ప్రారంభ వ్యవస్థ, తాళం లేకుండా ప్రవేశించే సదుపాయం వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి.
భద్రతా అంశాలకు కూడా సంస్థ ప్రాధాన్యం ఇచ్చింది. ఆరు గాలి సంచులు, చక్రాలు జారకుండా నిరోధించే వ్యవస్థ, బ్రేకింగ్ శక్తి పంపిణీ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ స్థిరత్వ నియంత్రణ, ఎత్తైన ప్రాంతాల్లో వాహనం వెనక్కి జారకుండా నిలిపే సదుపాయం, టైర్ల గాలి ఒత్తిడి పర్యవేక్షణ వ్యవస్థ, వెనుక దృశ్య కెమెరా వంటి భద్రతా ఫీచర్లను ట్రైబర్‌లో అందిస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# సింగరేణి అధికారులకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)



డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో జరిగిన సమావేశంలో అధికారుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి, ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ కీలకమని, కార్మికులు, అధికారులు సంస్థ అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని, ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో వారి విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమమే సంస్థ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు.

ప్రపంచీకరణ, పెరుగుతున్న పోటీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సంస్థ పురోగతికి అధికారులు సానుకూల దృక్పథంతో పనిచేయాలని అధికార సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనతో పాటు అధికారుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చూపుతున్న చొరవను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సింగరేణి అభివృద్ధి కార్యక్రమాలకు అధికారుల తరఫున పూర్తి సహకారం అందిస్తూ, సంస్థ సుస్థిరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.




# రక్తదానంతో బీఆర్ఎస్ నిరసన

- "మా రక్తం తీసుకో... రైతులకు నీళ్లివ్వు" నినాదాలు
- క్యాంపు కార్యాలయానికి వెళ్తుండగా విద్యార్థి నేతల అరెస్టు

హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

కాళేశ్వరం ప్రాజెక్టు, రైతులకు సాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, విద్యార్థి నాయకులు హాజరై రక్తదానం చేశారు. ఈ నిరసనను "రక్త దాహం తీర్చేందుకు రక్తదానం" పేరుతో చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వెంటనే సాగునీరు అందించాలని, రాజకీయ విమర్శలకు బదులుగా రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అవసరమైతే తమ రక్తాన్ని కూడా అర్పించడానికి సిద్ధమని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రక్తదాన శిబిరం అనంతరం సేకరించిన రక్త సంచులతో ముఖ్యమంత్రి శిబిర కార్యాలయానికి వెళ్లేందుకు బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని మార్గమధ్యంలో అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల చర్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వం రైతుల సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు మరింత ముదురుతున్నాయి. ప్రాజెక్టు నిర్వహణ, సాగునీటి సరఫరా, రైతుల ప్రయోజనాల అంశాలపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ వేడిని పెంచుతున్నాయి.

# సర్పంచ్ జ్యోతి బలవన్మరణం

- నిర్మల్ జిల్లాలో విషాద ఘటన
- ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్న సర్పంచ్
- కారణాలపై పోలీసుల దర్యాప్తు

నిర్మల్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):



నిర్మల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపడంతో పాటు స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సర్పంచ్ జ్యోతి బలవన్మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తులో లభించే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.





# దేవాదుల పనులకు వేగం

(మొదటి పేజీ తరువాయి)

పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రులకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రాజెక్టు పనుల్లో నిధుల కొరతకు తావు ఉండదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపడంతో పాటు దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని, రైతులకు సాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

ప్రాజెక్టు పరిధిలోని తుపాకులగూడెం సమ్మక్క-సారలమ్మ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ప్రవాహం, నీటి నిల్వలను మంత్రులు పరిశీలించారు. అనంతరం గుట్టల గంగారం సమీపంలోని జె. చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్‌ను సందర్శించి మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యం, నీటి సరఫరా పరిస్థితులను అధికారులు వివరించారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని మరింత పెంచే అంశాలపై కూడా చర్చించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు, భూసేకరణ, ఎత్తిపోతల వ్యవస్థ, సాగునీరు, తాగునీటి సరఫరా, మోటార్ల పనితీరు తదితర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి, భూసేకరణ ప్రక్రియను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పెండింగ్ బిల్లులను ఇప్పటికే విడుదల చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ అమలు చేస్తున్నామని, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రైతాంగానికి పూర్తి భరోసా కల్పిస్తామని చెప్పారు. సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, దేవాదుల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్సల్ టోప్పో, అటవీ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# యునాని వైద్యానికి ప్రాధాన్యం

- నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశం
- ఖాళీల భర్తీ, నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచన

హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

యునాని వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి నాణ్యమైన వైద్యం అందేలా అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ పనితీరు, నిజామియా టిబ్బీ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, నిర్మాణ పనులు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. యునాని వైద్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బీ కళాశాల, నిజామియా జనరల్ ఆస్పత్రి రాష్ట్రంలో యునాని వైద్య సేవలకు ప్రతిష్ఠాత్మక సంస్థలని మంత్రి పేర్కొన్నారు. ఈ సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.



ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బయటి రోగుల విభాగం భవనం, ఔషధ నిల్వ భవనం పనులను వేగవంతం చేసి వచ్చే జనవరి నాటికి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆస్పత్రిలో వైద్యులు, బోధనా సిబ్బంది, ఇతర ఉద్యోగుల ఖాళీలు ఉండటం వల్ల వైద్య సేవలు, విద్యా కార్యక్రమాలపై ఎలాంటి ప్రభావం పడకుండా వెంటనే ఖాళీల భర్తీకి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. యునాని వైద్యశాలలు, ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు శాఖ పురోగతిని వివరించారు. గత ఏడాది 138 మంది సహాయ ఆచార్యుల నియామకంతో వైద్యుల కొరత గణనీయంగా తగ్గిందని తెలిపారు. నిజామియా టిబ్బీ కళాశాల, నిజామియా జనరల్ ఆస్పత్రి వారసత్వ భవనాల పునరుద్ధరణతో పాటు కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. యునాని ఔషధాల కొనుగోలు, పంపిణీ కూడా నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు.

శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. రాష్ట్ర స్థాయి యునాని ఔషధ తయారీ కేంద్రం ఏర్పాటు కోసం సిద్ధం చేసిన ప్రాజెక్టు ప్రతిపాదనను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మౌలాలిలోని ప్రభుత్వ యునాని వైద్యశాల భవనానికి సంబంధించిన సమస్యలను పరిశీలించి అక్కడ వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మీర్ జుల్ఫికర్ అలీ, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆయుష్ శాఖ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు, నిజామియా టిబ్బీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యునాని వైద్య సేవలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# సింగరేణికి కేంద్రం అండ

- తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై హర్షం
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై రామ్‌చందర్‌రావు విమర్శలు

కొత్తగూడెం, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

కొత్తగూడెంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్రలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం సింగరేణి భవిష్యత్తుకు కీలక మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని, కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోలేదని రామ్‌చందర్‌రావు ఆరోపించారు. సంస్థను అప్పుల భారంలోకి నెట్టి, అనిశ్చిత పరిస్థితుల్లోకి తీసుకెళ్లారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేసిన కృషి ఫలితంగానే నైని, తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌లు సింగరేణి సంస్థకు కేటాయించబడ్డాయని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వానికి సింగరేణి కార్మికులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని రామ్‌చందర్‌రావు అభిప్రాయపడ్డారు. బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు సంస్థ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందని, దీని వల్ల సంస్థ మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

ఈ నిర్ణయం ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయని ఆయన అన్నారు. రాబోయే దశాబ్దాల పాటు వేలాది మంది సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు ఉపాధి భరోసా లభిస్తుందని, బొగ్గు పరిశ్రమ అభివృద్ధికి ఇది కీలక నిర్ణయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని రామ్‌చందర్‌రావు తెలిపారు. కార్మికుల సంక్షేమం, సంస్థ విస్తరణ, బొగ్గు ఉత్పత్తి పెంపు లక్ష్యంగా మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొంటూ, సింగరేణి మరింత అభివృద్ధి చెందేలా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడించారు.





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# విద్యార్థులకు నైపుణ్యాల వేదిక

- స్కిల్ ప్లస్ శిక్షణ కేంద్రం ప్రారంభం
- ఉద్యోగ అవకాశాలకు ఆధునిక శిక్షణ
- మంత్రి కొండా సురేఖ

వరంగల్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

వరంగల్‌లోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దేశ్‌పాండే స్కిల్లింగ్ బ్రిడ్జ్ టు ఆపర్చునిటీస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన "స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్"ను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యాలను పెంపొందించే అవకాశం లభించనుంది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా అత్యంత అవసరమని అన్నారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ శిక్షణ కేంద్రం ఆ దిశగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఉద్యోగాలకు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు ఇలాంటి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. విద్యాభ్యాసంతో పాటు నైపుణ్యాల పెంపుదలపై దృష్టి సారిస్తే దేశ, విదేశాల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థల సహకారంతో మరిన్ని శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి యువతను స్వయం ఉపాధి, ఉద్యోగ రంగాలకు సిద్ధం చేసే చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, దేశ్‌పాండే స్కిల్లింగ్ సంస్థ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణ కేంద్రాన్ని సమర్థంగా వినియోగించుకుని ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు.






# ప్రవల్లికకు సీఎం రేవంత్ అభినందనలు

- ఆసియా అండర్-23లో స్వర్ణ విజయం
- తెలంగాణ యువతకు స్ఫూర్తి అన్న సీఎం
- భారత జట్టుకూ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

చైనాలోని ఒర్డోస్‌లో జరుగుతున్న తొలి ఆసియా అండర్23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్2026లో మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణకు చెందిన ప్రవల్లిక నరిమళ్లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. అంతర్జాతీయ వేదికపై అసాధారణ ప్రతిభ కనబరిచి దేశానికి, తెలంగాణకు గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. నల్గొండ జిల్లాకు చెందిన ప్రవల్లిక ప్రస్తుతం ఎస్సీ గురుకుల డిగ్రీ కళాశాలలో చదువుతూ, డిండి గురుకుల క్రీడా అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె పట్టుదల, కృషితో అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తాపీ మేస్త్రీ కుమార్తె అయిన ప్రవల్లిక సంకల్పం ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించారని కొనియాడారు.

మహిళల 4×400 మీటర్ల రిలే పోటీలో ప్రవల్లికతో పాటు శ్రావణి సచిన్ సాంగ్లే, సాంద్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్ సభ్యులుగా ఉన్న భారత జట్టు 3 నిమిషాల 33.62 సెకన్లలో పందెాన్ని పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆతిథ్య దేశం చైనాను వెనక్కి నెట్టి భారత జట్టు అగ్రస్థానంలో నిలిచింది. అంతర్జాతీయ స్థాయికి చేరుకునే ముందు ప్రవల్లిక దేశీయ పోటీల్లో 23 స్వర్ణాలతో సహా మొత్తం 35 రాష్ట్రస్థాయి పతకాలను సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. ఆమె విజయాల్లో కీలక పాత్ర పోషించిన కోచ్‌లను కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు మొత్తం 16 పతకాలు సాధించడం ఆనందదాయకమని ముఖ్యమంత్రి తెలిపారు. మూడు స్వర్ణ, నాలుగు రజత, తొమ్మిది కాంస్య పతకాలతో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సీసీఐ కోసం బీఆర్ఎస్ ఢిల్లీ బాట

- జులై 15న కేంద్ర మంత్రిని కలవనున్న బీఆర్ఎస్
- పునఃప్రారంభానికి వినతిపత్రం సమర్పణ

ఆదిలాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమను తక్షణమే పునఃప్రారంభించాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి ఈ నెల 15న ఢిల్లీకి ప్రతినిధి బృందాన్ని పంపనుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి. రామారావు, మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలోని సీసీఐ సాధన కమిటీ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించనుంది. ఈ ప్రతినిధి బృందంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. ఆదిలాబాద్ ప్రజల చిరకాల డిమాండ్ అయిన సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా కోరడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పార్టీ తెలిపింది.

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పలుమార్లు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి సీసీఐ పునరుద్ధరణ అంశాన్ని ప్రస్తావించినట్లు పార్టీ పేర్కొంది. అలాగే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కె.టి. రామారావు కూడా పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు అందజేసినట్లు వెల్లడించింది. సీసీఐ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం, రాయితీలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గత 13 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రాలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి దెబ్బతిందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు కోల్పోయాయని పేర్కొంది.

2019, 2024 ఎన్నికల సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ నాయకులు సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని బీఆర్ఎస్ విమర్శించింది. ప్రభుత్వ రంగ సంస్థను పునరుద్ధరించకుండా ప్రైవేటీకరణ దిశగా చర్యలు జరుగుతున్నాయంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపు, పారిశ్రామికాభివృద్ధికి సీసీఐ పునఃప్రారంభం అత్యంత కీలకమని బీఆర్ఎస్ పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి జోక్యం చేసుకుని పరిశ్రమ పునరుద్ధరణపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేయనుంది.

# 96 లక్షల చిన్నారులకు ఆరోగ్య కవచం

- చిన్నారులకు ఆల్బండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభం
- 96.81 లక్షల మందికి లక్ష్యం
- నులిపురుగుల నివారణకు రాష్ట్రవ్యాప్త కార్యక్రమం
- తల్లిదండ్రులకు మంత్రి దామోదర విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రంలోని చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఒకటి నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల 96,81,855 మంది చిన్నారులు, విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి ఈ మాత్ర తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. నులిపురుగుల సమస్య పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అందువల్ల ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు.

నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, బరువు తగ్గడం వంటి సమస్యలు తలెత్తడంతో పాటు చదువుపై, ఏకాగ్రతపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని మంత్రి వివరించారు. నులిపురుగులు బయటకు కనిపించకపోయినా పిల్లల ఆరోగ్యానికి హానికరమని, అందుకే ప్రతి చిన్నారికి ఆల్బండజోల్ మాత్ర ఇవ్వడం అత్యంత అవసరమని చెప్పారు. ఆల్బండజోల్ మాత్ర వల్ల నులిపురుగుల సమస్య తగ్గి, ఆహారంలోని పోషకాలు శరీరానికి సమర్థవంతంగా అందుతాయని మంత్రి తెలిపారు. దీంతో రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా పిల్లల ఎదుగుదల, చదువుపై ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం మాత్రల పంపిణీతో మాత్రమే ముగియదని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, భోజనం ముందు చేతులను సబ్బుతో కడుక్కోవడం, పరిశుభ్రమైన తాగునీరు వినియోగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినడం వంటి మంచి అలవాట్లపై కూడా పిల్లలు, తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యాశాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు ఏ కారణంతోనైనా ఆల్బండజోల్ మాత్ర తీసుకోలేకపోయిన చిన్నారులకు జూలై 20న నిర్వహించే ప్రత్యేక మాప్‌అప్ కార్యక్రమంలో తప్పనిసరిగా మాత్ర అందజేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

# రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ విమర్శలు

- షాబాద్ ఘటనపై సీఎం మీద కేసు పెట్టాలని డిమాండ్
- బసవేశ్వర ప్రాజెక్టు కోసం పాదయాత్ర ప్రకటించిన మాజీ మంత్రి

సంగారెడ్డి, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):



నారాయణఖేడ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి టి. హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. షాబాద్‌లో జరిగిన హత్యల ఘటనను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని ఆరోపించారు. హింసను ప్రేరేపించేలా మాట్లాడిన ముఖ్యమంత్రిపై డీజీపీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

షాబాద్ ఘటనలో నిందితుడిపై సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లే ఘోర పరిణామాలు చోటుచేసుకున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుడి జోక్యంతో నిందితుడు తప్పించుకున్నాడని పేర్కొంటూ దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం అందరికీ సమానమేనని, అధికారంలో ఉన్నవారికీ అదే వర్తించాలని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని హరీశ్ రావు విమర్శించారు. గంజాయి, మహిళలపై నేరాలు, శాంతిభద్రతల అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై వేగంగా చర్యలు తీసుకుంటున్న పోలీసులు, తీవ్రమైన నేరాల విషయంలో అదే వేగం ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. రైతులు, విద్యార్థులు, సంక్షేమ పథకాల అమలుపై కూడా ప్రభుత్వాన్ని ఆయన లక్ష్యంగా చేసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీలో జాప్యం జరిగిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతు బీమా వంటి అంశాల్లో ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

నారాయణఖేడ్, ఆందోల్ ప్రాంతాలకు కీలకమైన సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టు పనులను ప్రభుత్వం నిలిపివేసిందని హరీశ్ రావు ఆరోపించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారాయణఖేడ్ ప్రాంత ప్రజల సమస్యలపై సమాధానం చెప్పాలని, అభివృద్ధి పనులను వెంటనే పునఃప్రారంభించాలని కోరారు. బసవేశ్వర ప్రాజెక్టు పూర్తి కోసం త్వరలో బసవేశ్వర విగ్రహం నుంచి సంగమేశ్వర వరకు భారీ పాదయాత్ర చేపడతామని హరీశ్ రావు ప్రకటించారు. రైతుల హక్కులు, సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరవీరుడు కిష్టయ్య కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

- డాక్టర్ ప్రియాంక విద్యకు ఆర్థిక సాయం
- మనవడు వేదాంత్‌కు ఆశీస్సులు
- అండగా ఉంటామని కుటుంబానికి భరోసా

కరీంనగర్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ ఉద్యమ అమరవీరుడు, దివంగత కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి. రామారావు సోమవారం కరీంనగర్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, తెలంగాణ ఉద్యమంలో కిష్టయ్య చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కిష్టయ్య సతీమణి పద్మావతి, కుమారుడు రాహుల్, కోడలు వర్ష, కుమార్తె డాక్టర్ ప్రియాంకతో కేటీఆర్ ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

ఇటీవల జన్మించిన కిష్టయ్య మనవడు వేదాంత్ రాఘవ కిష్టయ్యను కేటీఆర్ ఆశీర్వదించారు. చిన్నారికి వస్త్రాలు, కానుకలు అందజేయడంతో పాటు కిష్టయ్య పేరులోని తొలి అక్షరంతో రూపొందించిన ప్రత్యేక లాకెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కొంతసేపు ఆప్యాయంగా గడిపారు. కిష్టయ్య కుమార్తె డాక్టర్ ప్రియాంక వైద్య విద్యలో ఉన్నత విద్యాభ్యాసం కోసం బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా ఫీజు చెక్కును కేటీఆర్ అందజేశారు. విద్యాభ్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసి సమాజానికి సేవ చేయాలని ఆమెను ప్రోత్సహించారు.

కిష్టయ్య కుటుంబానికి అందించిన పరామర్శ, ఆర్థిక సహాయంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ ఇంటికి వచ్చి ధైర్యం చెప్పడంతో పాటు కుమార్తె విద్యకు అండగా నిలిచిన కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను చిరస్మరణీయంగా నిలబెట్టాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, డా. సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in